ప్రభ:- ఇట్లు – దశమహా విద్యామూర్తులను తెలిపి – అసంఖ్యాకములగు నీ విభూతుల నెవ్వఁడును తెలియఁజాలఁడని చెప్పఁబడినది. ( ఇందు 4 మూర్తులు చెప్పఁబడినవి. )

మూ॥ ధున్వన్తు సర్వవిపదః సుకృత ప్రియాణాం
ధున్వన్తు చాఖిల సుఖాన్యఘలాలసానామ్।
ఆవర్జ్యభూరి కరుణం పురజిత్ తరుణ్యా
శ్చిత్తం వసన్త తిలకాః కవిభర్తు రేతాః॥ 25

కవీశ్వరుఁడగు గణపతి చేత రచితములును, వసంతతిలకా వృత్త నిబద్ధములును, అగు ఈ స్తుతులు – శివ సుందరియగు పార్వతి యొక్క విస్తారమగు కరుణ గల హృదయమునాకర్షించి సుకృత ప్రియులగు సాధుజనుల యాపదలనన్నింటిని ధ్వంసము చేయుఁగాత! దుష్కృతముల యందభిలాషము గల దుర్జనుల సుఖముల నన్నిఁటిని తొలఁగించుఁగాత!

ఇతి శ్రీ మహర్షి రమణ భగవత్ పాదాన్తేవాసినో వాసిష్ఠస్య,
నరసింహ సూనో,
గణపతిమునేః కృతావుమాసహస్రే అష్టావింశః స్తబకః సమాప్తః

ఇది శ్రీ మహర్షి రమణ భగవత్ పాద శిష్యుఁడు, శరమర్షణ
సగోత్రుఁడు, శ్రీమత్ పంతుల
వేంయశాస్త్రి పౌత్రుఁడు, వేంకటరామ బుధేంద్ర పుత్రుఁడు,
లక్ష్మీనారాయణ శాస్త్రిచే నాంధ్రీకరింపఁబడిన ఉమాసహస్రమను
స్తోత్రకావ్యమున ఇరువది నెనిమిదవ స్తబకము. (సప్తమ శతకము)
సమాప్తము.

****



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (ఎనిమిదవ శతకము – ప్రథమ స్తబకము)

## ఏకోనత్రింశ స్తబకము

అవ:- ఇరువది తొమ్మిదవ స్తబకమున నవవిధమగు భజనము ప్రస్తావింపఁబడుచున్నది.

మూ॥ ఆయుష్యాభువనానాం చక్షుష్యాత్రిపురారేః
కుర్వన్తు ప్రమదంనః పార్వత్యాః స్మితలేశాః॥ 1

లోకుల యొక్క జీవనమే ప్రయోజనముగాఁ గలవియు, త్రిపురారియగు శివుని నేత్రమునకు హితములయినవియు, అగు పార్వతీ దేవి యొక్క స్మితలేశములు– మాకు హర్షమును గూర్చుఁగాత!

ప్రభ:- ''సకలభువన జీవనార్థములును, శివనయన తర్పకములును, పార్వతీ మందహాసములును – మాకు ప్రమోదమునిచ్చుఁగాత!'' అని యర్థము.

మూ॥ నాత్యర్ఘాణి నిరర్థం నేతవ్యాని దినాని
అమ్బాయాశ్చరితాని శ్రోతవ్యా న్యనఘాని॥ 2

మిక్కిలి వెలగలవియగు దినములు – నిష్ప్రయోజనముగా గడుపఁగూడదు. పావనములగు జగన్మాత యొక్క చరిత్రములు వినవలయును.

ప్రభ:- ఆయువంతయుఁ గూడ మితమైనది. కావున దినములను వృథ చేయఁదగదు. వానిని కృతకృత్యములుగా చేయఁదగును. దేవియొక్క పావన చరిత్రమును వినుట చేత శ్రోత్రేంద్రియము - కృతకృత్యమగును. ఆయువునకు సంబంధించిన దినములు - కృతార్థములగును. తొమ్మిది విధములు గల భజనమునందీశ్రవణము మొదటిదిగుచున్నది.

మూ॥ ఉద్యోగం కురుజిహ్వే! సంహర్తుం దురితాని
పూతాన్యద్రి సుతాయాః కీర్త్యన్తాం చరితాని॥ 3

ఓ నాలుకా! పాపములను నశింపఁజేయుట కుద్యమింపుము. పార్వతీ పవిత్ర చరిత్రములను కీర్తింపుము.

ప్రభ:- రసనమా! పార్వతీ పవిత్ర చరిత్రకీర్తనము చేత నీపాప సంహారోద్యమము ఫలితమగును. పూర్వశ్లోకమున శ్రవణేంద్రియ కర్తవ్యమును, ఈ శ్లోకమును వాగింద్రియకర్తవ్యమును, చెప్పఁబడినవి. కీర్తనమనునది - రెండవ భజనము.

అవ:- నియమసహితమగు స్మరణమును శ్లోకత్రయము చేత ప్రతిపాదించుచున్నాఁడు.

మూ॥ శ్రీ సక్తి ర్విని వార్యా చిన్తాకాఽపినకార్యా!
నిత్యం చేతసిధార్యా దీనానాం గతిరార్యా॥ 4

సంపదయం దాసక్తినొందఁగూడదు. ఏదియుఁగూడ చింతింపఁగూడదు. దీనులకు గతియగు, ఆర్యను, మనస్సునందు నిత్యమును ధ్యానముచే ధరింపవలయును.



ప్రభ:- అర్థేచ్ఛ) - తగదు, ఏ హేతువు చేతనైనను మనస్సు వ్యాకులముకాఁగూడదు. బలహీనులకు శరణమగు పార్వతి నెల్లపుడును మనస్సున ధ్యానింప వలయును.

మూ॥ జ్ఞాతుం యాగదితుంయా, శ్రోతుంయాశ్వసితుంయా
ద్రష్టుంయాఽన్తరశక్తి స్తిష్ఠా త్రస్మృతి రేషా॥ 5

ఏది - విషయములను తెలిసికొనుటకును, వాక్కులను పలుకుటకును, శబ్దములను వినుటకును, ఉచ్ఛ్వాస నిశ్వాసముల నొనర్చుటకును, రూపములను చూచుటకును, అంతరశక్తి యగుచుండునో, ఆ యంతర శక్తియుండుండుము. ఇదియే స్మృతి (జ్ఞప్తి. కేవలమగు సంవిత్తు)

మూ॥ విభ్రాజీనశతాభం బిభ్రాణం శిరసీన్దుమ్।
స్మర్తవ్యం జగదమ్బారూపంవా ధుతపాపమ్॥ 6

సూర్యశత దీప్తి గలిగి విరాజిల్లునదియు, శిరస్సున చంద్రుని ధరించునదియు, భక్తుల పాపములను తొలంగించునదియు, అగు జగదంబయొక్క రూపమునైనను స్మరింపఁదగును.

ప్రభ:-పూర్వ శ్లోకమున - అంతరశక్తి నిష్ఠ - స్మృతియని చెప్పఁబడినది. ఆనిష్ఠయంద శక్తులగు వారికి భాస్కరశతాభమును, చంద్రచూడమును, అగు అమ్మ యొక్క రూపము ధ్యానింపఁదగినదని యందు చెప్పఁబడినది. ఇచట - ఉపాసనము గూడ - స్మృతికి పర్యాయముగాఁ జెప్పబడినది.

అవ:- శ్లోకములు మూఁడింటిచేత - పాద సేవనము ప్రతిపాదింప బడుచున్నది.

మూ॥ యేషాంస్యాత్ పరితప్తం ప్రాయశ్చిత్తమఘేన ।
రుద్రాణీ పద సేవా ప్రాయశ్చిత్తమమీషామ్. 7

ఎవరికి - పాపము చేత - ప్రాయః (ఎక్కువగా) మనస్సు పరితపింపఁబడునో, వారికి రుద్రాణియగు దేవి యొక్క చరణభజనము - పాపనాశకమగు ప్రాయశ్చిత్తకర్మమగును.

ప్రభ:- ''ప్రాయోనామతపః ప్రోక్తం చిత్తం నిశ్చయ ఉచ్యతే
తపోనిశ్చయ సంయోగాత్ ప్రాయశ్చిత్త మితీర్యతే॥

'ప్రాయస్స'నఁగా, తపమని చెప్పఁబడును. చిత్తము నిశ్చయమని చెప్పఁబడును. తపోనిశ్చయ సంయోగము వలన ప్రాయశ్చిత్తమని చెప్పఁబడును' అని హేమాద్రి చెప్పియున్నాఁడు. ఇచట గ్రహింపవలసినది - పాపము చేత చిత్తమునకు పరితాపము గలుగునపుడు ఆపరితాపము - అనుతాపమునందు పర్యవసించును. అట్లు - అను (పశ్చాత్) తాపము గలవారికి భగవత్ పాదసేవగాని, తన్నామస్మరణము గాని, ప్రాయశ్చిత్తమగును. అనుతాపము కలుగునపుడు భగవన్నామస్మరణాదికము ఋజువుగా నుండదు. కావున నది పాపములను తొలగించునదియగు ప్రాయశ్చిత్తము కానేరదు. కావుననే-

కృతేపాపేఽనుతాపోవైయస్యపుంసః ప్రజాయతే
ప్రాయశ్చిత్తంతు తస్యైకం హరి సంస్మరణం పరమ్॥

పాపము చేయఁబడినపుడు, ఏ పురుషునకు - అను (పశ్చాత్) తాపము కలుగునో, వానికి శ్రేష్టమగు హరిస్మరణ మొక్కటియే - ప్రాయశ్చిత్తము. అని తెలిసిన పెద్దలు చెప్పియున్నారు.

మూ॥ తద్ దీప్తం పదయుగ్మం సేవేయ త్రభవన్తి
అఙ్గుల్యో దశభానోర్భానూనాం శతకాని॥ 8



కావున - ఏ పాదయుగ్మమునందున్న దశాంగుళులు (పదివ్రేళ్లు) సూర్య కిరణముల యొక్క దశ శతకములు (వేయి) అగుచుండునో, దీప్తమగు ఆ దేవీ పాదయుగళమును సేవించెదను.

ప్రభ:- దేవీ పాదద్వయమునందలి దశాంగుళులు - సూర్యకిరణ సహస్రరూపముగాఁ జెప్పఁబడినవి. దీప్తమగు ఆపాద ద్వయము యొక్క సేవ వలన ప్రాయశ్చిత్తము సిద్ధించునని భావము.

మూ॥ నో చేత్ కుప్యసి కిఞ్చిద్ యాచేవాచ మతీతే
సేవాంమాతరురీకుర్విష్టం మేకురుమావా॥ 9

వాక్కులకగోచరవగు జననీ! కోపగింపకుందు వేని నిన్నొకటియడిగెదను. నాయభీష్టమునిచ్చినను మానినను నా సేవనంగీకరింపుము.

అవ:-శ్లోకములు రెండింటిచేత - అర్చనమును దెలుపుచున్నాఁడు.

మూ॥ శర్వాణీ చరణార్చాపీఠం పీవర కాణామ్।
వధ్యస్థాన మిదం స్యా దుగ్రాణాం దురితానామ్॥ 10

సర్వపాప హింసకుఁడగు శర్వునిపత్నియగు పార్వతికి సంబంధించిన యీపాద పూజాపీఠము - దుష్టములై బలిసియున్న ఘోరములగు పాపములకు వధ్యస్థానము. (వధింపఁదగిన స్థలము)

మూ॥ స్కన్దామ్బా పదపీఠ స్పృష్టం చేద్ బలమాప్తమ్।
ఏకైకం సుమమంహ స్స్వైకైకం కులిశంస్యాత్॥ 11

కుమార జననియగు పార్వతి యొక్క పదపీఠము చేత స్పృశింపఁబడిన బలమును పొందిన యెడల ఒక్కొక్క పుష్పమును - చంపఁదగిన పాపముల విషయమున - ఒక్కొక్క వజ్రాయుధమగును.

ప్రభ:- దేవీపాద పీఠస్పర్శ లబ్ధమగు బలము గల ప్రతి కుసుమమునుగూడ - దురితసంహారమున వజ్రాయుధమగునని భావము.

అవ:- శ్లోకసప్తకము చేత వందనమును జెప్పుచున్నాఁడు.

మూ॥ అమ్భోజోప మమ(ఙ్ఘ్రిం శమ్భోః పట్టమహిష్యాః
అంహస్సంహతిము(గాం సంహర్తుం ప్రణమామః॥ 12

భయంకరమగు పాప సంహతిని సంహరించుటకై శంభుని పట్టమహిషియగు పార్వతి యొక్క అంభోజోపమమగు పాదమునకు ప్రణమిల్లుదుము.

ప్రభ:- దేవీచరణారవింద ప్రణామము - మాకు పాప ప్రణాశన ప్రయోజనమని యర్థము.

మూ॥ యేకాలీ పదవేషం నాలీకం ప్రణమన్తి
నైషాం కిఞ్చిదశక్యం నాలీకం మమవాక్యమ్॥ 13

కాలీపాద వేషమునకు (అలంకరింపఁబడిన బాహ్యమగు పాదాకృతికి) యథార్థమగు భక్తిచేత ప్రణామము నొనరించువారికి శక్యము కానిదేదియు లేదు. నామాట యలీకము (అనృతము) కాదు.

ప్రభ:- 'శిలాది ప్రతిమారూపమున నలంకరింపఁబడియున్న కాళీ పదమును ఋజుభక్తులై ప్రణమిల్లువారికి సర్వమును శక్యమగును, అనిభావము. ' ఆ కల్పకము, వేషము, నైపథ్యము, పతికర్మ - ప్రసాధనము, అనుపదములు - అలంకరింపఁబడిన బాహ్యాకారమును దెల్పును.

మూ॥ వాసస్తేఽ(తసమాప్తః పఙ్క్తే తో (వ్రజదూరమ్।
కాలీం శఙ్కరనారీం కాలేఽస్మిన్ ప్రణమామః॥ 14



ఓ పంకమా! (పాపమా!) నీకు నాయందలి నివాసము సమాప్తమయినది. (తా ప్ర) ఇక్కడనుండి దూరముగా పొమ్ము. మేమీసమయమున శివకాంతయగు కాలికి నమస్కరింతుము.

ప్రభ:- ఓ పాపమా! మేము పాపసంహర్త్రియగు కాళికి ప్రణామము చేయఁదగిన సమయము వచ్చినది. ప్రణామము ముగిసిన వెంటనే నీకు వినాశము తప్పదు. కావుననే ముందుగానే తొలఁగిపొమ్ము.

మూ॥ ఆశారేతదవస్థాభూభాగానటతస్తే
కామానాం క్వనుపారః కామారేర్నమనారీమ్॥ 15

ఓ సఖుఁడా! భూగోళమునందున్న దేశములయందు సంచరించుచున్న నీయాశ - (అధికమైనతృష్ణ) సంచారమేయగునవస్థ గలది. ( ఒకచోట నిలుచునది కాదు.) మనోరథములకు (కామములకు) పారమెక్కడిది? కావున శివనారికి నమస్కరింపుము.

ప్రభ:- నీవు తిరుగుచున్నంత వఱకును నీయాశకూడ తిరుగుచునే యుండును. కామమున కంతములేదు. కావున జగన్మాతకు నమస్కరింపుము.

మూ॥ ధన్యాస్తే తుహినాద్రేః కన్యాంయే ప్రణమన్తి
అన్యానున్న తశీర్షాన్ మన్యే వన్యలులాయాన్. 16

''హిమాచలకన్యకు నమస్కరించువారే. (శిరస్సువంచిన వారే) ధన్యులు. ఉన్నతములగు శిరస్సులుగల ( ఎత్తయిన శీర్షములు గల యితరులు - వన్యలులాయములు'' (అడవియందున్న దున్నపోతులు) అని తలంచుచున్నాను.

ప్రభ:- దేవికి నమస్కరించుటకై, ఎవ్వరి శీర్షములు నతములగునో వారు భాగ్యశాలులై ఉన్నతులగుదురు. తదితర శిరస్సులో - దున్నపోతుల శిరస్సులవలె ఉన్నతములైయుండును.

మూ॥ పాదామ్భోజముమాయాః ప్రాజ్ఞాస్ప్రణమన్తః
గృహ్ణన్తి శ్రియమస్మిన్ రాజన్తీంనిజశక్త్యా॥ 17

ఉమా పదాబ్జమునకు ప్రణమిల్లుచున్న ప్రాజ్ఞులు- ఈపాదాబ్జమున విరాజిల్లుచున్న సంపదను స్వశక్తిచేత గ్రహింతురు.

**ప్రభ:-** ప్రణామము వలన పాదారవింద శ్రీయొక్క గ్రహణము - ప్రాజ్ఞులకు స్వశక్తిచేత - సిద్ధించునని భావము.

మూ॥ మన్దారాద్రిసుతాఙ్ఘ్రీ దాతారౌసదృశౌస్తః
ఉత్కణ్ఠైఃఫలమాద్యా దన్యస్మాన్నతకణ్ఠైః 18

ఇష్టార్థప్రదమగు మందార (దేవ) వృక్షమును, పార్వతీచరణమును, సమానులగు దాతలు, ఉత్కంఠులు - మందార ఫలమును, నతకంఠులు - దేవీచరణ ఫలమును సంపాదింతురు. (మీదికెత్తఁబడిన కంఠము (శిరస్సు) గలవారిచేత మందార వృక్షమునుండి ఫలము సంపాదింపఁబడును. నమ్రశిరస్సులచేత పార్వతీచరణమునుండి ఫలము గ్రహింపఁబడును.)

**ప్రభ:-** ఉన్న మితశిరస్కులకు వృక్షఫలమును, నమిత శిరస్కులకు చరణ ఫలమును లభించునని తాత్పర్యము.

మూ॥ కాలస్యాపి విజేతుః శర్వాణ్యాశ్చరణస్య
ఏషోఽహం కవిలోకక్ష్మాపాలోఽస్మిభుజిష్యః 19

కాలునిగూడ (అంతకుని గూడ) జయించిన శర్వాణీచరణమునకు కింకరుఁడనగు ఈ నేను - కవిలోకాధీశ్వరుఁడనై యున్నాను.

**ప్రభ:-** ఆ యీ పార్వతీపాద భక్తిమాహాత్మ్యమువలననే - నేను కవీశ్వరుడ నైతినని భావము. ఇందు దాస్యమను భజనము చెప్పఁబడినది.



**అవ:-** క్రింది శ్లోకమున సఖ్యమును చెప్పుచున్నాడు.

మూ॥ రక్తేదర్శయరాగం రుద్రాణీ పదపద్మే
చేతః పుష్యతిశోభాం సారస్సారవతోఽగ్రే॥ 20

ఓ మనమా! రక్తమగు (ఎఱ్ఱనిదగు - రాగము గలదగు) రుద్రాణీపద పద్మమునందు రాగమును (ప్రేమమును) ప్రదర్శింపుము. అట్లు చేసిన యెడల శ్రేయము కలుగును. అదెట్లనిన- సారవంతుని (బలవంతుని) యెడల సారము (బలము) శోభను పోషించును.

**ప్రభ:-** అనురక్తుని ముందు - అనురాగము వృద్ధినొందును. సారవంతుని ముందు సారము వృద్ధినొందును. అని భావము.

అవ:- ' ఆత్మని వేదనమే - ప్రేమ రూపమును, ముక్తిప్రదమును, అగు పరాభక్తి' అనునభిప్రాయమున అంబాపదభక్తి రూపమగు ఆత్మరతిని నాలుగు శ్లోకముల చేత ప్రదర్శించుచున్నాఁడు.

మూ॥ సంశోధ్యాగమజాలం సారాంశం ప్రవదామః
స్కన్దామ్బాపదభక్తిర్భుక్త్యై చాథముక్త్యై. 21

ఆగమ బృందమును పరీక్షించి, అందుముఖ్యమగు అంశమును (సారాంశమును) చెప్పుచున్నాము. స్కందాంబయొక్క పదభక్తి, ఐహికాముష్మిక భోగముకొఱకును, మోక్షము కొఱకును, గూడ సమర్థమగుచుండును.

**ప్రభ:-** వేదములను, ప్రమాణ శాస్త్రములగు తంత్రములను, సంశోధించిన యెడల - జగన్మాత పదభక్తియే భోగమోక్షప్రదమగునని తెలియును.

మూ॥ వాత్సల్యం గతిహీనేష్వాయుష్యం సుకృతస్య
భూయోభిః సహసఖ్యం శ్రీ హేతుష్విహముఖ్యమ్. 22

గతిలేనివారగు దీనుల విషయమునందగు వాత్సల్యము (ప్రీతి) పుణ్యమునకు జీవితమునిచ్చును. బహుసంఖ్యాకులగు జనులతోడి సఖ్యము - ఈ లోకమున సంపత్ కారణములయందు ముఖ్యము.

**ప్రభ:-** రక్షా విహీనులగు జనుల యెడ ప్రీతిగలిగి యుండుట వలన పుణ్యము వృద్ధినొందును. బహుజనసౌహార్ద్రము - వర్చోవర్ధనము. అని భావము.

మూ॥ శ్లాఘ్యం పుష్యతి కామం ప్రేమాస్వప్రమదాయామ్
శర్వాణీ పదభక్తిర్నిత్యాయ ప్రమదాయ॥ 23

స్వస్త్రీయందలి ప్రేమము- శ్రేష్ఠమగు కామమును వృద్ధినొందించును. ఉమాపాదభక్తి - నిత్యమగునానందము నొసఁగును.

మూ॥ ఏకైవం బహుభేదా భిన్నా త్వాద్విషయాణామ్।
రత్యాఖ్యా ద్రుతిరన్తః సాసూతేఫలభేదాన్ 24

పూర్వశ్లోకమునఁ జెప్పఁబడిన విధమున రతి (ప్రీతి) అనుపేరు గల, అంతర్ద్రుతి. (హృదయస్థితమగు ప్రీతిరసస్రుతి) విషయ (ఉపాధి) భేదము వలన వాత్సల్య- ప్రేమ- భక్త్యాది బహు భేదములు గలదై - పుణ్యమును వృద్ధినొందించుట, మొదలగు ఫలభేదములను సమకూర్చును.

**ప్రభ:-** రతియనగా, ప్రీతి, అనురాగము, వాత్సల్యము, మున్నగునవి ఉపాధిభేదమున రతియందుఁగలిగిన భేదములు.



మూ॥ హర్షం కల్పనమాతుః, మత్తోభక్తిభరేణ
తన్వన్నేషవిధత్తాం హేరమ్బోమదలేఖాః 25

భక్త్యతిశయము చేత - మదించి (మదమునొంది - లేక హర్షించి) మదలేఖలను (మదజల రేఖలను, లేక, మద లేఖావృత్త నిబద్ధములగు స్తుతులను) కావించుచు (హేరంబుఁడు- గణపతి- లేక కవి- గణపతి) తల్లి యగు ఉమకు అనిర్వచనీయమగు హర్షమును ఘటించుఁగాత!

**వివ:-** ఇందుపమ ధ్వనించుచున్నది. గజముఖుఁడగుట వలన దానధారచేత మదించి మదజల రేఖలను వెలార్చుచున్న గణపతివలె, మదించి (హర్షించి) మదలేఖావృత్త నిబద్ధములగు స్తుతులను గావించిన గణపతి - తల్లియగు ఉమకుసమ్మదమును గలిగించుగాతమని భావము.

ఇది 'సవ్యాఖ్యమగు ఏకోనత్రింశ'స్తబకము.

****